క్లుప్తంగా

రక్షణ సువార్త మహోత్సవాలు



దెందులూరు ఎరుషాలేం ప్రేయర్ మినిస్ట్రీస్ సువార్త మహోత్సవాలు

దెందులూరు: సువార్త మరింత విశ్వవ్యాప్తం కావాలని ప్రతి ఒక్కరూ దేవుని అడుగుజాడల్లో పయనించాలని దెందులూరు ఎరుషాలేం ప్రేయర్స్ మినిస్ట్రీస్ సిస్టర్ గ్రేస్‌రాణి అన్నారు. దెందులూరులో 3 రోజులుగా రక్షణ సువార్త మహోత్సవాలు ఎరుషాలేమ్ ప్రేయర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం దెందులూరుతోపాటు సమీప విశ్వాసులు అధిక సంఖ్యలో సువార్త మహోత్సవాల్లో పాల్గొన్నారు. పలువురు ప్రసంగీకులు దేవుని వాఖ్య పరిచయం చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



రావులపర్రులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: రావులపర్రులో ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. రావులపర్రు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గాది వెంకటరమణ, కమిటీ సభ్యులు వాసుబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఎట్టకేలకు టీడీపీ శిలాఫలకానికి ముసుగు



టీడీపీ శిలాఫలకాన్ని మూసివేసిన దృశ్యం

సాక్షి స్పందన

దెందులూరు: దెందులూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోనే ఉన్న టీడీపీ శిలాఫలకానికి ఎట్టకేలకు అధికారులు ముసుగు వేశారు. కోడ్ వర్తించదా అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఆదివారం రెవెన్యూ ఉద్యోగులు స్పందించి టీడీపీ శిలాఫలకాన్ని కాగితాలతో మూసివేశారు. సాక్షాత్తు తహసీల్దార్ కార్యాలయంలోని టీడీపీ నేతల పేరుతో ఉన్న శిలాఫలకం సైతం ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు విస్మరించడం గమనార్హం.

ఆర్థిక సాయం అందజేత

పెదవేగి : అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో వెంటాడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. ఆదివారం పెదవేగి మండలం విజయరాయి పంచాయతీ ముత్తనవీడు మెట్టకు చెందిన బత్తుల చిరంజీవికి ఇద్దరు కుమారులు వీరు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బత్తుల అజయ్‌కుమార్ ఆరో తరగతి, బత్తుల తనుష్ కుమార్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరిరువురు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం వైద్య ఖర్చులకు కూడా తగినంత స్తోమత లేక అజయ్‌కుమార్ కామెర్లతో, ధనుష్ కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. దీనిని గమనించిన శ్రీ సాయి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పి ఉమామహేశ్వరరావు సంస్థకు విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన సంస్థ సభ్యులు బాధిత కుటుంబాన్ని సందర్శించి వీరి తల్లి బత్తుల భూలక్ష్మికి రూ.15 వేలను అందించారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సంస్థ తరపున సహాయం చేస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బీఆర్వీ కుమార్, డీకేఎస్ఎస్ ప్రకాష్ రావు, జి.రాజు, జి.మోహన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: నాచుగుంటకు చెందిన ఆకుల సూర్యనారాయణ(40) ఆత్మహత్యకు పాల్పడి చనిపోవడంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మణికుమార్ ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుల సూర్యనారాయణ 10 ఏళ్ల క్రితం ప్రమాదానికి గురై నడుము క్రింది భాగం స్పర్శ కోల్పోయి మంచానికే పరిమితమయ్యాడు. అతడి తల్లి కూలి పనులకు వెళ్తూ వచ్చిన ఆదాయంతో పోషిస్తోంది. శనివారం ఆమె పనులకు బయటకు వెళ్లింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో మన స్థాపం చెందిన సూర్యనారాయణ అందుబాటులో ఉన్న చాకును తీసుకుని బొడ్డు కింద భాగంలో స్పర్శ లేకపోవడంతో కోసుకోవడంతో రక్తస్రావమై చనిపోయాడు. కూలి పనులకు వెళ్లి వచ్చిన ఆమె కొడుకు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. బంధువులు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

జగనన్నను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధం



నాగేశ్వరపురంలో ఎన్నికల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



నాగేశ్వరపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- నాగేశ్వరపురంలో జోరుగా ఎన్నికల ప్రచారం

భీమడోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కో లేక ఇతర పార్టీలన్నీ పొత్తుతో అధికారం కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని, వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో కూటమికి ఓటమి తప్పదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం, నాగేశ్వరపురం, వైఎస్సార్ కాలనీ, జగనన్న కాలనీల్లో ఆదివారం సాయంత్రం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల జోష్ నడుమ ఎన్నికల ప్రచారం కొనసాగింది. వాసుబాబు గడప గడపకూ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. తొలుత ఆయనకు గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వాసుబాబు ప్రజలకు వివరించారు. వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కరపత్రాలను అందించారు. రెండు బటన్లను ఫ్యాన్ గుర్తుపై నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్ యాదవ్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ, జనసేన పార్టీలు, ఎల్లోమీడియా కలిసి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు నిర్ణయించుకున్నారని వాసుబాబు అన్నారు. మే నెల 13న ప్రజాతీర్పుతో కూటమి పార్టీలు చాప చుట్టేయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీపీ కనుమాల రామయ్య, డీసీసీబీ డైరెక్టర్ కందుల పాటి శ్రీను, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల యూత్ కన్వీనర్ మద్దుల రాజా, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, గొండు చైతన్య, నాయకులు పుప్పాల రామ్మోహనరావు, పుప్పాల రమేష్, పెద్దిరెడ్డి నారాయణ మూర్తి, పచ్చా లక్ష్మీనారాయణ, పుప్పాల బుజ్జులు, బొల్లారపు పవన్, తాడి సుబ్బిరెడ్డి, పులఖండం మధు, గుడివాడ సీతారామాంజనేయులు, ఏపూరి రాంబాబు, పుప్పాల ఏసుబాబు, జీవీ రాజు, ఓగిరాల చంద్రం, నల్లిమిల్లి నాగరాజు, బూరుగు ఇశ్రాయేలు, రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా



తల్లాపురం రహదారిలో కలపను అక్రమంగా రవాణా చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం తల్లాపురం - చేబ్రోలు రహదారిలో చెట్లు నరికి కలపను ఆదివారం ట్రాక్టర్లపై అక్రమంగా రవాణా చేశారు. అధికారులందరూ ఎన్నికల హడావుడిలో ఉంటే ఇదే అదునుగా కొందరు కలపను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ రహదారిలో తల్లాపురం, అప్పారావుపేట గ్రామాలున్నాయి. రెండు పంచాయతీ కార్యదర్శులు మా పరిధిలో కలప కాదని చెబుతున్నారు. చెట్లు అక్రమంగా నరికి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రియులు అంటున్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

గణపవరం: ఐదేళ్లుగా అవినీతిరహితంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ, అభివృద్ధి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని, గణపవరం మండలం వైఎస్సార్ సీపీ బాధ్యుడు, ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల చినబాబు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పరలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధితో పేదలకు ఆర్థికంగా భరోసా లభించిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అవినీతికి తావులేకుండా నీతినిజాయతీతో పాలన సాగించిన ఎమ్మెల్యే వాసుబాబును మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర బేబి, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి బాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, వైస్ఎంపీపీ నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి దానమ్మ, పార్టీ నాయకులు ముత్యాల శ్రీను, ఐవీ రాజు, ఇందుకూరి ప్రకాష్‌రాజు, మంతెన ప్రసాదరాజు, గరగ రవి, బి.సత్యనారాయణ, సంపద శ్రీను, కొరపాటి నరేష్, బంతా అశోక్, నందివాడ కొండలరావు పాల్గొన్నారు.



పిప్పరలో వాసుబాబుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న చినబాబు, పార్టీ నేతలు

ఎమ్మెల్యే కొఠారు సోదరి ప్రచారం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మరింత అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సోదరి క్రొత్తపల్లి వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం పెరుగ్గూడెంలో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరిని, ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యలమర్తి సత్తిబాబు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ యలమర్తి బాపూజీ, పెరుగ్గూడెం వైఎస్సార్ సీపీ మహిళ కార్యకర్తలు ఉన్నారు.



పెరుగ్గూడెంలో ప్రచారం చేస్తున్న క్రొత్తపల్లి వెంకటలక్ష్మి, మహిళలు

బావాయిపాలెంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం

నిడమర్రు: బావాయిపాలెం సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే సోదరుడు, మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఫ్యాను గుర్తుకు ఓటు వెయ్యాలని రెండోరోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మీ ఓటు ద్వారా మద్దతు తెలపాలని కోరారు. గ్రామ వైఎస్సార్ సీపీ బాధ్యుడు సంకు నాగేషు మాట్లాడుతూ బావాయిపాలెంలో శిథిలమైన గ్రామ పంచాయతీ భవనం స్థానం స్థానంలో నేడు ఆధునిక వసతులతో కూడిన సచివాలయ భవనం, డిజిటల్ లైబ్రరీని ప్రభుత్వం నిర్మించిందన్నారు. అనంతరం ఇంటింటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు తిరిగి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అందిన సంక్షేమ పథకాల నగదు వివరాలు వెల్లడించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల బాలాజీ పద్మావతి, పార్టీ అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బయ్య, ఎంపీటీసీ ముత్యాల రామసుబ్బారావు, బొబ్బిలి పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ ధనుకొండ బుజ్జి, నిమ్మల రాము, రమేష్, పుప్పాల శ్రీను, దారాబత్తుల సరయ్య, గొట్టుముక్కల విశ్వనాధరాజు, వడ్డి పెదకాపు, సంకు పద్మాకర్, బొబ్బిలి కిషోర్, వామిశెట్టి రాము, బొబ్బిలి శ్రీను, ముత్యాల, తాటిపాక దానియేలు, బత్తిన సత్యనారాయణ, గొర్రెల సింహాచలం, గొర్రెల రాంబాబు ఉన్నారు.



బావాయిపాలెంలో ప్రచారం చేస్తున్న పుప్పాల కన్నబాబు, సంకు నాగశేషు

సంక్షేమాభివృద్ధికి ఓటు వేయాలి



వేగివాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



తాళ్లగోకవరంలో ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి మీకు మంచి జరిగితేనే మాకు ఓటెయ్యాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. పెదవేగి మండలంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు విస్తృతంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా కె కన్నాపురం, తాళ్ల గోకవరం, ఎంఆర్‌సీ కాలనీ, వేగివాడ, గ్రామాల్లో ప్రచారం హోరెత్తింది. అడుగడుగునా ప్రజలు పూలు చల్లి అబ్బయ్యచౌదరికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. దళితవాడల్లో, వేగివాడ గ్రామ ప్రధాన కూడలిలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో కలిసి అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదేళ్లలో రూ.3,450 కోట్ల వ్యయంతో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామన్నారు. పెదవేగి మండలంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులన్నీ అభివృద్ధి చేశామన్నారు. పెదవేగి మండలంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు రూ.79 కోట్లతో ప్రతి ఇంటికీ రోజుకి 55 లీటర్ల నీటిని అందించే బృహత్కర కార్యక్రమం చేపట్టామన్నారు. రెండు జిల్లాల చిరకాల వాంఛ బలివే వంతెన నిర్మాణం పూర్తవుతోందని చెప్పారు. నేడు తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మించామని, నియోజకవర్గంలో 61 హస్పిటళ్ల అభివృద్ధి, నాడు–నేడులో 211 బడుల రూపురేఖలు మార్చామని తెలిపారు. 81 సచివాలయాలు, 81 ఆర్‌బీకే కేంద్రాలు, 17 గోదాంలు నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఆయన బహిరంగంగా ప్రతిపక్షాలకు సవాల్ చేశారు. నేడు విజయం పొందడానికి అందరూ సిద్ధమా అంటూ అబ్బయ్యచౌదరి అడిగిన ప్రశ్నకు ప్రజలు సిద్ధం అంటూ నినదిస్తూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

భీమడోలు: ప్రజాస్వామ్యయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని ఎస్సై వై.సుధాకర్ అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఆదివారం సాయంత్రం ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో సాయుధ దళాల సిబ్బది, పోలీస్ సిబ్బంది పోలసానిపల్లి, వడ్లపట్ల, వసంతనగర్, కొండ్రెడ్డినగర్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, విఘాతం కలిగించేలా కార్యకలాపాలు చేస్తే చర్యలు తప్పవంటూ వీధుల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు కల్పించిన ఓటు హక్కును మే 13న ప్రతి ఓటరు నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. గ్రామాల్లో పోలీసుల నిఘా పెంచామన్నారు. రహదారులపై ప్రయాణించే తరుణంలో ప్రతి ఒక్కరూ రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్లరాదని, రూ.10వేలకు మించి గిఫ్టులను తీసుకెళ్లడం నేరమన్నారు. సరైన ఆధారాలతో నగదును తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చలపతిరావు, పోలీసులు, సాయుధ దళాలు పాల్గొన్నారు.



పోలసానిపల్లిలో పోలీస్, సాయుధ దళాల ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న భీమడోలు ఎస్సై సుధాకర్

29 నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

భీమడోలు: వేసవి సెలవులను విద్యార్థులు సరదాగా గడపాలన్న లక్ష్యంతో ఈనెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలనులో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రత.. ప్రయాణికుల అవస్థ

- ఉదయం 9 గంటల నుంచి సూర్యుని భగభగలు
- గతేడాది కంటే ఎక్కువ ప్రభావం
- శీతలపానీయాలకు గిరాకీ



మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్న దుగ్గిరాల జాతీయ రహదారి

పెదవేగి : ఆకస్మికంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో నియోజకవర్గంలోని ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఎండ తీవ్రతకు పాఠశాలల దగ్గర నుంచి కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఆరంభంలోనే ఇలా ఎండలు ఉంటే మునుముందు ఎండల తీవ్రత ఇంకెలా ఉంటుందోనని ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. సాధారణంగా మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సంవత్సరం మార్చి ప్రారంభం నుంచి ఎండలు మండిపోవడంతో ప్రజలకు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, ముంజులు, జ్యూస్ లు, చల్లని పానీయాలకు గిరాకీ పెరిగింది.

మండుతున్న ఎండలు

జిల్లాలో ఇప్పటికే 40 డిగ్రీల సెల్సియస్ దాటింది. రాబోయో వారంరోజుల్లో జిల్లాలో ఎండవేడిమి మరింత పెరుగుతుందని ఇదే సమయంలో క్రమేపీ చలి వాతావరణం తగ్గుముఖం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఖగోళ పరిశీలనల ప్రకారం గడిచిన రెండు దశాబ్దాల్లో 2021 నాటి ఎండకాలం తీవ్రత చాలా ఎక్కువ. ఈ సంవత్సరం దానికి మించి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఫిబ్రవరి చివరి వారం వరకు చలిగాలుల ఉధృతి ఉంటుంది. మార్చి మొదటి వారం నుంచి ఎండల తీవ్రత పెరిగి మే నాటికి తీవ్రస్థాయికి చేరుకోవాలి. ఈ ఏడాది ఆరంభంలోనే జిల్లాలో వేడి వాతావరణం మొదలైంది. ఓజోన్ పొరలో క్రమేపీ పెరుగుతున్న ఒత్తిడికి తోడు గతం కంటే పచ్చని వాతావరణం కనుమరుగు కావడమే దీనికి కారణమని చెబుతున్నారు. చిత్తశుద్ధితో మొక్కల పెంపకం చేపట్టి, పచ్చదనం పెంచితే వేసవి అంతగా జనంపై ప్రతాపం చూపదని అధికారులు ఆ దిశగా పయనిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రజలు చెబుతున్నారు. వాహనాల ద్వారా వెలువడే పలు రకాల వాయువుల కారణంగా కాలుష్యం పెరిగి రాబోయో రోజుల్లో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపట్టిన మొక్కల పెంపకాన్ని అధికారులు, ప్రజలు ఓ ఉద్యమంలా చేపట్టి, పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పలువురు అంటున్నారు.



నిర్మానుష్యంగా పెదవేగి ప్రధాన రహదారి



విజయరాయి-బలివే రహదారిలో విక్రయానికి సిద్ధంగా పుచ్చకాయలు

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. శరీరంలో నీరు శాతం తగ్గకుండా చూసుకోవాలి. సోడియం, పొటాషియం వంటివి తగ్గడంతో మనిషికి తలనొప్పి, కండరాలనొప్పి, స్పృహ కోల్పోవడం, వంటివి సంభవిస్తాయి. ముఖ్యంగా కూలి పనికి వెళ్లే వారు ప్రతి రోజు కనీసం 5 లీటర్ల నీరును తాగాలి. ఈ వేడిమి ప్రభావం నాలుగేళ్ల లోపు, 65 ఏళ్లు పైబడి ఉన్న వారిపై ఎక్కువగా ఉంటుంది.

– పిల్లా పూర్ణిమ, వైద్యాధికారి, పెదవేగి